కథ

# ఉప్పెన

శేఖమూరి శ్రీనివాస్



లోకనాథం అప్పుడే ఆఫీస్ నుంచి ఇంటికొచ్చాడు. భార్య రోహిణి, కొడుకు వినీత్‌లు తన కోసమే ఎదురు చూస్తున్నట్లుండడం కాస్త కలవరపాటుకు గురిచేసింది. అయినా అంతా మామూలుగానే ఉన్నట్లు లుంగీలోకి మారి పేపర్ చేత పట్టుక్కూర్చున్నాడు. రోహిణి, వినీత్‌లు కూడా చెరో కుర్చీ లాక్కొని లోకనాథానికి ఎదురుగా కూర్చున్నారు.

''నాన్నా.... నేను చెప్పింది ఏం చేశారు?'' మెల్లగా అడిగాడు వినీత్.

''చూద్దాం... అయినా అన్నీ ఇప్పటికిప్పుడు కావాలంటే ఎలా?''

లోకనాథం ప్రతిస్పందన వినీత్‌తోపాటు, రోహిణికి కూడా అసంతృప్తిగా వుంది.

''అందరి ముందు నాకెంత నామోషీగా వుందో తెలుసా?''

"నామోషీ దేనికి? నూటికి తొంభై మంది ఎలా వున్నారో, ఎలా వెళుతున్నారో అలాగే వెళదాం."

"నాకలా కుదరదు. నేను ఇంతవరకూ మిమ్మల్ని నాకిది కావాలని అడగలేదు. సెలవులైపోయి కాలేజీలో చేరేలోపు నేనడిగింది మీరివ్వాలి."

"నీ కోరిక నువ్వు చెప్పావు. బాగానే వుంది. మరి డబ్బు సంగతి?" లోకనాథం నోట్లోంచి డబ్బు గురించి వినపడగానే రోహిణి జోక్యం చేసుకుంది.

"దేనికైనా డబ్బు లేదనడమే! అయినా వాడు అడక్కడక్కడ ఒకటి అడిగితే అదీ...చేతగాద నడం...మీ సంబడం ఇరవైయేళ్ల నుంచీ నేను చూస్తున్నదేగా?" రోహిణి మాటల్లోని దెప్పిపొడుపు లోకనాథానికి కొత్తేం కాదు. పెళ్లనయినప్పటి నుంచీ వున్నదే!

తల్లి మద్దతుతో వినీత్ గళం మరింత పదునెక్కింది. తండ్రి కావాలనే తాత్సారం చేస్తున్నాడని, తను గట్టిగా మాట్లాడకుంటే మెత్తబడేలా లేడని నిర్ణయించుకున్నాడు. "నాన్నా.... నేను కాలేజీకి వెళ్లేలోపు ఇప్పించండి. దానికి వన్ మంత్ టైముంది. ఎప్పటిలా నా వల్ల కాదంటారా... చదువులు చదవడం నా వల్ల కూడా కాదని ఈ అపార్ట్‌మెంటు నుంచి కిందికి దూకేస్తా. మీ ఇష్టం ఇక..." చరచరా నడుచుకుంటూ బయటకెళ్లాడు.

లోకనాథం ఒళ్లు ఝల్లుమంది. ఎంత మాటన్నాడు! దూకి చావడమా? ఏమంత కష్టం వచ్చింది? వినీత్‌కు తను ఏరోజు తక్కువ చేశాడు? ఎందుకిలా మారాడో అర్థం కాలేదు. ఉబికి వస్తున్న కన్నీళ్లను బలవంతంగా ఆపి కర్చీఫ్‌తో కళ్లు ఒత్తుకున్నాడు. రోహిణికైతే బ్రతకడం చేతకాని వాడిలా జీవితంలోని మాధుర్యాన్ని అనుభవించలేని దద్దమ్మలా లోకనాథం అగుపించాడు. తనూ అక్కణ్ణించి విసురుగా వెళ్లిపోయింది.

★★★

ఆఫీసుకు వెళ్లేందుకు బస్‌లో కూర్చున్న లోకనాథానికి ఇంటి మీదే ధ్యాసంతా! హైదరాబాద్ రావడానికి ముందర గతమంతా జ్ఞప్తికి వచ్చింది. పల్లెటూరికి, పట్టణానికి మధ్యస్థంగా వుండే ఊరిలో వుండేవాడు తను. లోకనాథం శ్రద్ధతో పాటు, సహజ ప్రతిభ కూడా తోడై చదువులో వినీత్ ఒక అడుగు ముందే వుండేవాడు. ఏడవ తరగతిలోనే వినీత్ సామర్థ్యం అందరికీ తెలిసింది. ఇక పదవ తరగతిలో డివిజన్‌లోనే అందరికన్నా ఎక్కువ మార్కులు సంపాదించాడు.

బంధువులు, స్నేహితులు లోకనాథాన్ని అభినందనలతో ముంచెత్తారు. ఇంటర్ మాత్రం మంచి కార్పొరేట్ కాలేజీలోనే చేర్పమని ఉచిత సలహాల కుప్పలు పోశారు. లోకనాథం కూడా 'మంచి' కాలేజీలో చేర్పాలనే నిర్ణయించుకున్నాడు. చదువు విషయంలో ఢోకా లేకున్నా వినీత్ మొండితనమే లోకనాథానికి భయం కలిగించేది.

అనుకోకుండా బదిలీల అనుమతి వచ్చి, సీనియారిటీ వల్ల లోకనాథానికి కౌన్సిలింగులో మొదట్లోనే వుండే అవకాశం దొరికింది. మిత్రులు, భార్య ప్రోద్బలంతో హైదరాబాద్‌కు బదిలీ ఎంచుకున్నాడు. కొడుకు పట్ల మరింత శ్రద్ధ వహించేందుకు వచ్చిన మంచి అవకాశమని మనసునిండా సంతోషం!

కుటుంబాన్ని హైదరాబాద్ తీసుకురావడం, ఆఫీసుకు దగ్గర్లోనే అపార్ట్‌మెంటు దొరకడం, వినీత్‌ని ర్యాంకులు పంట పండించే కార్పొరేట్ వ్యవసాయ క్షేత్రంలో వదలడం జరిగింది. వీక్లీ టెస్టులు, మంత్లీ టెస్టులు... అన్నిట్లోనూ వినీత్ ఒకే... తొంభైశాతం పైనే మార్కులు సాధిస్తున్నాడు. లోకనాథానికి ఆనందంగానే వుంది.

ఐదారు నెలలు గడిచిందో లేదో తండ్రి ముందు తన కోరికను బలంగా వెల్లడించాడు వినీత్. అరవై వేలుపెట్టి తనకొక బైక్ కొనివ్వమన్నాడు. లోకనాథం సౌమ్యంగా చెప్పాడు. ఆర్థిక పరిస్థితిని వివరించాడు. కానీ, వినీత్ దృక్పథంలో మార్పు రాలేదు. పరుషంగా చెబితే మరింత మొండి అవుతాడని భయం. ఓ రోజు మందలించాడు. ఫలితం వినీత్ మౌనం దాల్చాడు. అదీ ఒకటీ రెండు రోజులు కాదు. రెండు మూడు నెలలు. లోకనాథంతో మాట్లాడలేదు.

ఓ రోజు లోకనాథమే చొరవ తీసుకొని, వినీత్‌కు నచ్చజెప్పి రెణ్ణెల్లలో బైక్ కొనిస్తానన్నాడు. మాట అనడమే కాని, వాస్తవ రూపం దాల్చడం కష్టమని లోకనాథానికి తెలుసు. తన జీతమే అంతంత! హైదరాబాద్ రాకముందు బొటాబొటిగా సరిపోయేది. ఇక్కడికొచ్చాక మరీ ఇబ్బందైంది. అలవాటు లేకున్నా ఖర్చులు తట్టుకునేందుకు అదనపు నిధుల కోసం చేయి చాచక తప్పలేదు. అన్నింటినీ కలుపుకొని అప్పులు చేయకుండా బండిని లాగించేస్తున్నాడు.

ఎప్పుడైనా అవసరమైతే కొలీగ్ ధర్మలింగం వద్ద హ్యాండ్ లోన్ తీసుకోవడం! గతమంతా వెనక్కెళ్లి.. నిన్నటికి నిన్న చస్తానని వినీత్ బెదిరించడం జ్ఞప్తికి వచ్చింది. అది లోకనాథాన్ని స్థిరంగా వుండనీయడం లేదు. కొడుకు మోటార్‌సైకిల్ కోసం ధర్మలింగం వద్ద మూడు రూపాయల వడ్డీకి అరవై వేలు తీసుకోవాలంటే భయమేసింది. సర్వీస్‌లో మొదటిసారి..భవిష్యత్ కొరకు దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ నుంచి లోన్ కావాలని దరఖాస్తు పెట్టాడు. మంజూరైంది నలభై వేలే! మిగతా ఇరవై... ధర్మలింగంకు బాండ్ పేపర్ రాసివ్వక తప్పలేదు.

★★★

బైక్స్ షోరూమ్....

వినీత్ తనకు నచ్చిన బైక్‌ను సెలక్ట్ చేసి..లోకనాథానికి ధర చెప్పాడు. డబ్బులు ఇచ్చాక బైక్ కీస్ వినీత్‌కిచ్చారు షోరూమ్ వాళ్లు. దానికి కావలసిన అదనపు హంగులు, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ అన్నీ సిద్ధమయ్యాయి.

"నాన్నా... ఎక్కండి ఇంటికెళదాం." వినీత్ పిలుపు విని లోకనాథం కాస్త తటపటాయించాడు. మనసు కాస్త ఆందోళనగా వుంది. కాస్త రిలాక్స్ అవుదామనిపించింది.

"నువ్వెళ్లులే....నాకు చిన్న పనుంది చూసుకు



లోకనాథం ఒళ్లు ఝల్లుమంది. ఎంత మాటన్నాడు! దూకి చావడమా? ఏమంత కష్టం వచ్చింది? వినీత్‌కు తను ఏరోజు తక్కువ చేశాడు? ఎందుకిలా మారాడో అర్థం కాలేదు. ఉబికి వస్తున్న కన్నీళ్లను బలవంతంగా ఆపి కర్చీఫ్‌తో కళ్లు ఒత్తుకున్నాడు. రోహిణికైతే బ్రతకడం చేతకాని వాడిలా జీవితంలోని మాధుర్యాన్ని అనుభవించలేని దద్దమ్మలా లోకనాథం అగుపించాడు.

వస్తాను...'' అని వినీత్ వెళ్లాక ఓ హోటల్లోకి వెళ్లి ఇరానీ చాయ్‌కి ఆర్డరిచ్చాడు. ''టీ'' వచ్చేంత వరకూ కళ్లు మూసుకొని జరిగిన పరిణామాల దృశ్యమాలికను వీక్షిస్తూ విశ్లేషించసాగాడు.

''ఏరా...కొడుక్కి కొత్త బైక్ కొనివ్వడం వర కేనా? నువ్వు సరదాగా తిరిగేది లేదా?''

ఆ మాటలకు లోకనాథం ఉలిక్కిపడి కళ్లు తెరిచి చూశాడు. ఎదురుగా భానుమూర్తి! తను, లోకనాథం చిన్ననాటి స్నేహితులు. భానుమూర్తి పాత్రికేయుడు. అతను ఐదు సంవత్సరాల క్రితమే భాగ్యనగరంలో స్థిరపడిపోయాడు. లోకనాథం బదిలీ అయి వచ్చాక భానుమూర్తితో ఫోన్‌లో మాట్లాడడమే కాని, ప్రత్యక్షంగా కలిసింది లేదు.

''ఏయ్ భానూ... ఎలా వున్నావు?'' ఎంతో సంతోషంతో స్నేహితుడి భుజాన్ని తట్టాడు. లోక నాథం వినీత్‌కు బైక్ తీసివ్వడం భానుమూర్తి గమ నించాడనుకున్నాడు.

''నేను బాగానే వున్నాను. నువ్వేంటి డల్‌గా వున్నావు? కొత్త బైక్ స్వంతమైన సంతోషం మీ అబ్బాయి ముఖంలోనే కాదు, నీలో కూడా ఉండా లిగా. ఏం ఆలోచిస్తున్నావో తెలుసుకోవచ్చా?''

''ఆలోచన ఏం లేదు భాను...కాస్త తలనొ ప్పిగా వుంటే టీ తాగేందుకు వచ్చానంతే.. అంతకు మించి ఇంకేం లేదు.'' లోకనాథం ఎంత లౌక్యంగా చెప్పినా, అతని ముఖంలోని ఆందోళన, ప్రశాంతత లేమి స్పష్టంగా కనిపిస్తున్నాయి.

టీ వచ్చింది. తాగడం పూర్తయ్యాక ఇద్దరూ బయటకు వచ్చి ఎదురుగా వున్న పార్కులోకి నడి చారు.

''ఫోన్‌లో మాట్లాడడమే గాని, ఒక్కసారన్నా మా ఆఫీసుకు రావచ్చు గదరా...'' తన ఆందోళనను కొద్దిగా తగ్గించుకుంటూ సంభాషణని మొదలు పెట్టాడు లోకనాథం.

''విలేఖరిగా వున్నప్పుడు సమయం దొరికేది. ఇప్పుడీ సబ్ ఎడిటర్ అయ్యాక పనిభారం ఎక్కువ గానే వుంది. నా విషయం సరే.... నీ కుటుంబం ఎలా వుంది? నీ కొడుకు చదువులో షార్ప్ అని గతంలోనే తెలుసు. బైక్ పైన కూడా షార్ప్‌గా దూసుకెళతాడని ఇప్పుడే తెలిసింది.''

బైక్ మాట వినపడగానే లోకనాథం ముఖంలో రంగులు మారాయి. ''భానూ... వినీత్‌ది మొండి వైఖరి. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లంటాడు. ఎవరుచెప్పినా వినడు! ఇదే ఇబ్బందిగా వుంది. దానికి తోడు వాడికి మా ఆవిడ మద్దతు పుష్క లంగా వుంది. బైక్ కొనాలని పట్టుబట్టి మరీ కొనిపి చ్చాడు. పెంకితనం క్రమేపీ పెరుగుతూనే వుంది.'' అని లోకనాథం బైక్ బ్యాక్ గ్రౌండ్ మొత్తం చెప్పాడు.

''ఒరేయ్... ఇది నీ ఒక్కరి సమస్యే కాదు. కోటి ఆశలతో సుందరమైన భవిష్యత్ కోసం పట్టణాలకొ చ్చిన మధ్యతరగతి జీవులందరి సమస్య. పట్టణం గాలి సోకగానే సున్నితత్వం, కుటుంబ సంబంధాలు, ఆప్యాయతలు, కరవు అవుతున్నాయి. ఇక్కడి యాంత్రిక జీవనం, డబ్బుకు గల అపరిమిత ప్రాధా న్యత, వినియోగ సంస్కృతి యువతను మాయా ప్రపంచంలోకి తీసుకెళుతున్నాయి. బుద్ధిమంతుల్ని కూడా బలహీనులుగా మార్చుస్తున్న జీవన విధా నాలు సమాజాన్ని 'ఉప్పెన'లా చుట్టేస్తున్నాయి.''

''మరి ఇలాంటి పరిస్థితి నుంచి బయటపడేదె లారా?'' లోకనాథంలో భవిష్యత్ పట్ల ఆందోళన కలిగింది. ముున్ముందు వినీత్ ఇంకెంత మొండిగా తయారై ఇబ్బంది పెడతాడోనని భయం వేసింది.


''ఎవరి కుటుంబాన్ని వాళ్లే సంరక్షించుకోవల సిన పరిస్థితి. డబ్బే లోకం కాదన్న వాస్తవాన్ని పిల్ల లకు చిన్నప్పట్నుంచే నేర్పాలి. మానవ సంబంధాలు, సమాజ అసమానతల గురించి అవగాహన కల్పించాలి. చదువు డబ్బు కోసమేనంటూ వ్యవస్థీ కృతమవుతున్న భావనను కుటుంబ సభ్యుల్లో తొలగించే ప్రయత్నం చేయాలి. అసలు వినియోగ సంస్కృతి పట్ల ప్రతి కుటుంబం అప్రమత్తంగా వుండాలి లోకనాథం. ప్రస్తుత సమాజాన్ని అల్లక ల్లోలం చేస్తున్న మహా ఉప్పెన అదే! నిద్ర లేచింది మొదలు పడుకునే వరకూ చివరకు కలల్లో కూడా కొత్త వస్తువులు కొని, పాతవి విసిరేయడం మన వ్యాపకమైంది. కొత్త వస్తువును, ఉపకరణాన్ని కొన్నప్పుడల్లా సంతృప్తి చెందినట్లు, జీవితం ధన్య మైనట్లు భావించుకోవడం ఎంత ఆత్మవంచన! షాపింగే జీవితాన్ని శాసించడం గుర్రం రౌతును లాక్కెళ్లినట్లుంది. మానవ సంబంధాలే మనిషి అస్తి త్వాన్ని భూమిపై స్థిరపరుస్తాయి. యాంత్రిక జీవనం, యంత్రాల సహచర్యం అనుభూతి లేని అనుభవం లాంటివి...నిన్ను విసిగిస్తున్నానా?'' మధ్యలో ఆపి అడిగాడు భానుమూర్తి.


''అదేం లేదురా... నువ్వు చెప్పేది వాస్తవాలే కదా! వినీత్ పరిస్థితే అర్థం కావడం లేదు. భవిష్య త్‌లో వాడెలా తయారవుతాడోనని భయంగా వుంది.''

''ఇప్పటికే అప్పు చేసి మరీ బైక్ కొనిచ్చి మరీ తప్పు చేశావు. దీంతో బెదిరిస్తే లొంగిపోతానని చెప్పకనే చెప్పావు. ప్రస్తుతం వాడి వయసు వాస్త వాలను గ్రహించి తక్షణమే మారే లక్షణాన్ని కలిగి వుండదు. బెదిరింపులకు నువ్వు లొంగి పోవాల్సిన అవసరం లేదు. కుటుంబసభ్యులకు వాస్తవాలను, ఆర్థిక పరిస్థితులను చాలా బలంగా వినిపించాలి. కుటుంబంలోని అందరి మధ్యా మంచి కమ్యూనికే షన్‌వుండాలి. అనుబంధాలు, ఆప్యాయతలకిచ్చే ప్రాముఖ్యత మాటల్లో కంటే చేతల్లో చూపాలి. అన్నిటికన్నా పిల్లల్నిపెంచడమే కష్టం అంటారు! పైపై మెరుగుల ఈ నగర జీవితం తరచి చూస్తే మురికి కూపం. ఎనీ హౌ... ఇప్పటికే చాలా సమ యమైంది. హాలీడే అయినా ఆఫీస్‌లో పని వుంది. వుంటాను మరి..'' భానుమూర్తి బయలుదేరడానికి సిద్ధమయ్యాడు.

''భానూ...అమృత ఏం చేస్తోంది?'' భాను మూర్తి భార్య గురించి అడిగాడు లోకనాథం.

''ఓ స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తోంది. మురికి వాడల్లో బడి ముఖం ఎరగని పిల్లలు, బాల కార్మి కులకు మొబైల్ స్కూల్స్ నడుపుతోందా సంస్థ.



అందులో తను శిక్షకురాలిగా వుంది. ఆదాయం కంటే సంతృప్తి ఎక్కువ! అమృతకు ఆ ఉద్యోగం సంతోషంగానే వుంది.''

లోకనాథానికి రోహిణి గుర్తుకొచ్చింది.

★★★

ఓ రోజు లోకనాథం ఆఫీస్‌లో వుండగా సెల్ మోగింది. అవతలి నుంచి ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్ మాట్లాడాడు. వినీత్‌కి యాక్సిడెంట్ అయితే, హాస్పిటల్‌లో చేర్చామని, వెంటనే రమ్మని సారాంశం.

పెరిగిన గుండె దడను నియంత్రించు కుంటూనే, హాస్పిటల్ చేరాడు లోకనాథం. ఫ్లై ఓవర్ పై వెళుతుండగా బైక్ అదుపు తప్పి రెయిలింగుకు ఢీకొట్టి, వినీత్ ఎగిరి ఫ్లై ఓవర్ నుంచి కింద పడ్డాడని ఆసుపత్రిలో చెప్పారు. హెల్మెట్ వుండబట్టి తలకు గాయాలేమీ కాలేదని ఊరడింపు. కానీ, వెన్నెముకకు బలమైన గాయాలు తగిలాయని... అత్యవసరంగా ఏదైనా కార్పొరేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లమని సూచన.

హడావుడిగా అంబులెన్స్‌లో వినీత్‌ను ఓ కార్పొరేట్ హాస్పిటల్‌కు తరలించారు. లోకనాథం విషయం చెప్పకుండా హాస్పిటల్ చిరునామా చెప్పి రోహిణిని రమ్మన్నాడు.

చేతిలో డబ్బులు కూడా లేవు. ధర్మలింగానికి ఫోన్ చేసి విషయమంతా చెప్పాడు. కాసేపటికే ధర్మలింగం, రోహిణి వచ్చారు. ధర్మలింగం తను తెచ్చిన యాభైవేలు ఇవ్వడంతో వినీత్‌కు రకరకాల టెస్ట్‌లుచేయడం మొదలుపెట్టారు.

ఓ గంట తర్వాత బయటకు వచ్చిన సీనియర్ డాక్టర్ లోకనాథాన్ని పక్కకు తీసుకెళ్లి, ''మీ బాబుకు జరిగింది మేజర్ యాక్సిడెంట్. ప్రాణాలు పోవాల్సింది! మీ అదృష్టం బాగుండి సేవ్ అయ్యాడు. హెడ్ ఇన్జురీస్ ఏమీ లేవు. కాకుంటే బోన్ ఫ్రాక్చర్స్! ఇవి ఒక సమస్య కాదు. అన్నిటి కన్నా ముఖ్యమైంది స్పైన్(వెన్నెముక)డ్యామేజ్. దానికి ఆపరేషన్ చేయాలంటే ఖర్చు ఎక్కువ అవుతుంది. చేయకుంటే జీవితాంతం చక్రాల కుర్చీకి పరిమితం కావల్సి వుంటుంది.'' స్మూత్‌గా చెప్పాడు.

''ఎంతవుతుంది డాక్టర్!'' లోకనాథం గద్గద స్వరంతో అడిగాడు.

''సుమారు మూడు లక్షలు!''

''మూడు లక్షలా..?'' లోకనాథం కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి. ఓ పక్క కొడుకు స్థితి. మరో పక్క డబ్బెక్కడ్నించి తేవాలో తెలీని పరిస్థితి.

''సార్....మీరు ఆపరేషన్ చేయండి. ఓ గంటలో డబ్బు అరేంజ్ చేస్తాను.'' ఏదో తెలీని ధైర్యంతో అన్నాడు లోకనాథం.

''సారీ మిస్టర్...హాస్పిటల్ రూల్స్ అందుకు ఒప్పుకోవు. మీరు ఎంత త్వరగా మనీ అరేంజ్ చేయగలిగితే మేము అంత స్పీడుగా ఆపరేషన్ స్టార్ట్ చేస్తాము. మీరు లేట్ చేసేకొద్దీ ఆపరేషన్ రిజల్ట్ కూడా మీకు ఫేవర్‌గా వుండకపోవచ్చు. ఇక మీదే ఆలస్యం..'' డాక్టర్ అక్కడ్నించి వెళ్లిపోయాడు.

డాక్టర్ వెళ్లగానే ధర్మలింగం, రోహిణి దగ్గరకొచ్చారు. విషయం వారికి చెప్పాడు లోకనాథం. అంతేకాదు. నాకు నువ్వే దిక్కుఅన్నట్లు ధర్మలింగం వైపు చూస్తూ... ''ఇప్పటికి సర్దు... మనకు మెడికల్ రీ ఇంబర్స్‌మెంట్ వుందిగా.... అవి రాగానే వడ్డీతో సహా ఇస్తాను'' అన్నాడు దీనంగా.

ధర్మలింగం ఆలోచనలో పడ్డాడు. తనకు మూడు లక్షలు ఓ లెక్కలోది కాదు! కానీ, లోకనాథం వాటిని తీర్చొద్దు! రీ ఇంబర్స్‌మెంట్ రెండు లక్షల వరకూ వస్తుంది. అంతకుమించి పావలా కూడా రాదు. మిగతా లక్ష ఎలా తీరుస్తాడు? లోకనాథం పిఎఫ్ అకౌంట్‌లో పాతికవేలకు మించి లేవు. బైక్ కోసం లోన్ తీసుకోవడంతో అది తీర్చే దాకా కొత్త లోన్ ఇవ్వరు. ష్యూరిటీ లేకుండా పెద్ద మొత్తంలో అప్పులు ఇవ్వడం ఎన్నడూ చేయలేదు.

''రీ ఇంబర్స్‌మెంట్ ద్వారా ప్రభుత్వం రెండు లక్షలిస్తుంది. సరే. మిగతా లక్ష ఎలా తీరుస్తావు లోకనాథం?'' మెత్తగానే అడిగినా ధర్మలింగం గొంతులో కాఠిన్యం తొంగి చూసింది.

లోకనాథంలో కూడా ఆలోచన మొదలైంది. ధర్మలింగం ఉద్యోగి అయినా పక్కా వడ్డీ వ్యాపారి. తను ఎప్పుడు అప్పిచ్చినా మూడురూపాయలకు తక్కువ వడ్డీ వసూలు చేయడు. అలాంటిది పెద్ద మొత్తంలో డబ్బంటే...అంత సులువుగా ఇవ్వడు కదా!

అతనా అయోమయ స్థితిలో వున్నప్పుడే రోహిణికో 'అద్భుతమైన' ఉపాయం తోచింది. భర్తను పక్కకు పిలిచి చెవిలో ఆ ఉపాయం చెప్పింది. ఆమె మాటలు వినగానే లోకనాథం మరింత నీరసపడిపోయాడు. ఊబిలో చిక్కుకున్నట్లయింది.

ఎటూ తేల్చుకోలేక ఓ ఐదు నిమిషాలు అచేతనంగా ఉండిపోయాడు. రోహిణి తట్టుకోలేక పోయింది. ''ఎంత సేపు ఆలోచిస్తారు? ఒక్కగానొక్క బిడ్డ...డబ్బు దగ్గర ఆలోచిస్తే రోజూ వాడిని చూసి ఏడవాల్సిందే. మీ మూర్ఖత్వం మాని నేను చెప్పినట్లు చేయండి'' అనడమే గాక, తను లోకనాథానికి చెప్పిన విషయాన్ని ధర్మలింగానికి వివరించింది.

ధర్మలింగానికి ఆమె మాటల్లో ఏ తప్పూలేదని అనిపించింది. లోకనాథమే త్రిశంకు స్వర్గంలో ఉన్నాడు. మనసును కందిరీగల్లా చుట్టిన ఆలోచనలు! రోహిణి పోరు పడలేకే లోకనాథం తల్లిని ఊర్లోని స్వంత ఇంట్లో ఒంటరిగా వుంచాడు. ఉన్న రెండెకరాల పొలాన్ని కౌలుకివ్వడంతో వచ్చే ధాన్యం, కాస్త డబ్బుతో ఆమె జీవితం సాఫీగా గడుస్తోంది.

''ముసలామెను ఏ ఓల్డ్ ఏజ్ హోమ్‌లోనో పడేసి.. పొలం, ఇల్లు అమ్మి ఆ డబ్బు వినీత్ వైద్యానికి వాడమని రోహిణి చెప్పిన సలహా!....కాదు, కాదు ఆదేశం.

ఏదో ఒక విధంగా తల్లిని ఆదుకోగలనన్న నమ్మకం తన మీద తనకు ఏర్పడడంతో...రోహిణి చెప్పినట్లే చేశాడు లోకనాథం. పొలం, ఇల్లు ధర్మలింగానికి తనఖా పెట్టి వినీత్‌కు ఆపరేషన్ చేయించాడు. ఆపరేషన్ సక్సెస్! తనఖా పెట్టిని వాటిని విడిపించుకోలేనన్న సంగతి లోకనాథానికి తెలుసు. విలువ ఎంతున్నా తనఖా పెట్టిన వాటిని అప్పుకు చెల్లేసి, తల్లిని వృద్ధాశ్రమంలో చేర్చాడు. చేర్చబోయే ముందు దరఖాస్తు పత్రంలో 'లోకనాథం, దూరపు బంధువు' అని రాశాడు.

ఉప్పెన ముంపు ముప్పు తిప్పలు పెట్టి అల్లకల్లోలం చేసింది. చేస్తోంది. లోకనాథం ఒక్కడ్నే కాదు!

★

